# అందం

అందంగా ఉన్న మనిషినో, వస్తువునో, దృశ్యాన్నో చూసినప్పుడు మనకి తెలీకుండానే మనసు స్పందించి మరోసారి చూస్తాం! మళ్ళీ మళ్ళీ చూస్తాం ! అందానికా మహత్తు ఉంటుందనేది అందరూ అంగీకరించే నగ్నసత్యం!

'అందానికంత ప్రత్యేకత ఉంది కదా' అని మనమందరం మన దైనందిన జీవితంలో ఎప్పుడూ అందంగానే కన్పించడానికి ప్రయత్నిస్తాం!

అయితే-

ఆ ప్రయత్నంలో మనం మన వయసుని మించి నలభయ్యో ఏట టీనేజర్స్‌లా తయారైనా - పదహారేళ్ళ వయస్సులో ప్రౌఢలా తయారైనా - అతిగా అలంకరించుకున్నా - బొత్తిగా నిర్లక్ష్యం చేసినా - చూపరులకి ఎబ్బెట్టుగా, అమ్యూజింగ్‌గా, ఎక్సెంట్రిగ్గా ఉంటుంది.... లోలోపల నవ్వుకునేలా చేస్తుంది !

మన 'సహజమైన అందం' ఎదుటి వాళ్ళ చూపుల్ని తిప్పుకోనీకుండా చేస్తే - 'తెచ్చిపెట్టుకున్న అందం'చూపుల్ని తిప్పుకునేలా...మన 'సౌందర్య స్పృహ'... చూపుల్ని దించుకునేలా చేస్తుంది!

బండెడు నగలు దిగేసుకుని, పట్టు పీతాంబరాలు కట్టుకున్నంత మాత్రాన అందం కులుకుతూ వచ్చి మన ఒళ్ళో వాల్తుందనుకోవడం పొరపాటు !

ఎవరికైనా అందమనేది ధగధగలాడే పట్టు వస్త్రాలతోనో... జిగేల్మనే ఆభరణాలతోనో వచ్చేది కాదు......

మనిషికి నిజమైన అందం... ఆ మనిషి తాలూకు 'విజయం, సంస్కారం'.

ఈసురోమని కూర్చోకుండా - ఏ రంగంలోనైనా దూసుకుపోయి, విజయలక్ష్మితో తిరిగి వస్తే... మనిషి కురూపైనా సరే మన కంటికి నలకూబరుడిలాగే కన్పిస్తాడు!

ఒక వ్యక్తికి ఉండే....

డబ్బూ, అధికారం, అందం....

అతడికో 'గుర్తింపు'ని మాత్రమే తెచ్చిపెడ్తే...

అతడి విజయం అతడికో 'గ్లామర్'నీ...

అతడి సంస్కారం... అతడికో 'గౌరవాన్నీ' తెచ్చిపెడ్తాయి!

పోతే...

మనం మనకి గౌరవాన్ని తెచ్చిపెట్టే దానికోసమో, గ్లామర్‌ని తెచ్చిపెట్టే వాటికోసమో ఆరాటపడ్తే.... 'అందం' గానీ...

కేవలం 'గుర్తింపు' కోసమే తాపత్రయ పడ్తే.... చూసేవాళ్ళకి 'వికారం' పుడ్తుందని గ్రహించడం అవసరం !



16-02-1995